నాడు సంక్షోభం-నేడు సంక్షేమం



పలగరలో టీడీపీ నాయకుడి ఇంటివద్ద లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలును, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలును ప్రజలు గమనించాలని, అప్పట్లో సంక్షోభం ఉంటే ఇప్పుడు సంక్షేమం ఉందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేట మండలం పలగరలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి లబ్ధిదారులకు వారు అందుకున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకం అనేది అర్హత ఉన్నా అందేది కాదని, ఇప్పుడు అర్హత ఉంటే ఇంటివద్దకే పథకం వస్తోందని తెలిపారు. అర్హులై ఉండి పథకాలకు దూరంగా ఉన్నవారు ఉంటే చెప్పాలని కోరారు. అప్పట్లో కమిటీ సిఫార్సులు, చేతివాటాలు, నాయకుల చుట్టూ తిరగడం, దళారీతనం వంటివి ఉంటే ఇప్పుడు అటువంటివి లేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాల అమలుకు వలంటీర్ల వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇంతటి సేవలు అందిస్తున్న ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకోవాల్సిన అవసరం అందరికీ ఉందని పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యే జోగారావును ఆశీర్వదిస్తున్న సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వంజరాపు

టీడీపీ నాయకుడి ఇంటి దగ్గర బుక్‌లెట్

అరకు పార్లమెంటు నియోజక వర్గ టీడీపీ కార్యదర్శి ఎం.అప్పారావు కుటుంబానికి బుక్‌లెట్ అందించి రూ. 2,51,369 లబ్ధిని ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందుకున్నారని వారికి వివరించి అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, డీటీ రత్నకుమారి, సర్పంచ్ గౌరమ్మ, ఎంపీటీసీ రామకృష్ణమ్మ, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, వైఎస్ ఎంపీపీ వి.సాయిరాం, ఎస్.భాస్కరరావు, కె.సత్యం నాయుడు, జాన్, సర్పంచ్‌లు కె.మోహనరావు, సుందరరావు, ఆర్.శ్రీనివాసరావు, విజయ, ఎంపీటీసీలు రామకృష్ణనాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, టి.ప్రసాదరావు, కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



లబ్ధిదారుకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరలా ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ప్రజలను కోరారు. మున్సిపాలిటీ 6వ వార్డులో అగురువీధి, జర్జాపువీధుల్లో స్థానిక కౌన్సిలర్ జర్జాపు నీలిమ అధ్యక్షతన, కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తమ వార్డులోకి వచ్చిన రాజన్నదొరకు ప్రజలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికి వెళ్లిన రాజన్నదొర జగనన్న పాలనలో ఇప్పటి వరకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. పింఛన్లు తదితర ప్రజల సమస్యలను విన్న ఆయన వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాజన్నదొర ప్రజలతో మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న నగదును మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తి, ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, గొర్లె వెంకటరమణ, పిరిడి రామక్రిష్ణ, కర్రి అప్పలస్వామి, పతివాడ శివ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణ సాయం నగదును అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ

సాలూరు: మున్సిపాలిటిలో గాంధీనగర్ – 2లో యామజాలవీధిలో గుండెపోటుతో జనవరి 28న మృతి చెందిన పుల్లబట్ల పవన్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయాన్ని మంగళవారం అందించారు. తక్షణ సాయం నగదు రూ.10 వేలను మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ మృతుని తల్లి శాంతికుమారికి అందించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ అల్లు ఈశ్వరరావు, వార్డు కన్వీనర్ ఎం.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 148 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తదితరులు

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ ,రెడాక్స్ లేబొరేటరీస్, ఎస్‌బీఐ కార్డ్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 278 మంది పాల్గొనగా 148 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, జేకేసీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అంజలిదేవి తదితరులు

సాలూరు: ప్రకాశం జిల్లా దొనకొండలో జనవరి 28, 29, 30 తేదీలలో జరిగిన అండర్ – 17 బాయ్స్ అండ్ గర్ల్స్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలంలోని పురోహితునివలస ఆదర్శ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చారని పీడీ రవి మంగళవారం తెలిపారు. పోటీల్లో విజయనగరం జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా ఈ జట్టులో కళాశాలకు చెందిన మల్లేశ్వరి, సమీరా ప్రతిభ కనబర్చారని వివరించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ అంజలిదేవి తదితరులు అభినందించారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేయాలి



లచ్చయ్యపేటలో పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు

సీతానగరం: మంచినీటి పథకాలకు జరుగుతున్న పనులను నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం లచ్చయ్యపేట, సూరంపేట గ్రామాల్లో జరుగుతున్న మంచినీటి పథకాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూరంపేటలో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు పంపిణీ చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన తాగునీరు సరఫరా చేయడానికి అవసరమైన వనరులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహన చోదకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం ద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని ఎస్సై శివప్రసాద్ కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో మంగళవారం ట్రాఫిక్ రూల్స్‌పై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నోపార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. రహదారిపై, నోపార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపితే అపరాధ రుసుం విధించనున్నట్లు చెప్పారు.

వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



పంటల సాగుపై రైతులనుంచి విషయ సేకరణ చేస్తున్న వ్యవసాయ కమిషనరేట్ ఏడీఏ ప్రేమ్‌కుమార్

సీతానగరం: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడానికి రైతులు వ్యవసాయపరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని వ్యవసాయ కమిషనరేట్ (గుంటూరు)ఏడీఏ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఆర్. వెంకంపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మేలైన యాజమాన్య పద్ధతులు (గాప్) క్లస్టర్ పొలంబడి కార్యక్రమం ఏఓ ఎస్.అవినాష్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ఏ రకం విత్తనాలను వాడుతున్నారు, దిగుబడి ఏ విధంగా వస్తుందని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు చేసిన పొలం పర్యావరణ పరిసరాల విశ్లేషణను పరిశీలించారు. విత్తన శుద్ధి, బ్యాలెట్ బాక్స్‌టెస్ట్ ద్వారా మిత్ర, శత్రు పురుగులమీద రైతులకున్న పరిజ్ఞానాన్ని తెలుసుకుని, ఎంట్రీ పాయింట్ ఆక్టివిటీ ద్వారా పురుగు మందులు పిచికారీ చేసినపుడు జరిగే చర్యలు, పిచికారీ చేయడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పొలంబడి జిల్లా కోఆర్డినేటర్ ఏడీఏ ఆర్.శ్రీనివాసరావు, పార్వతీపురం ఏడీఏ టి.వేంకటేశ్వరరావు, సర్పంచ్ పి. శ్రీనివాసరావు, 10 క్లస్టర్ గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామకంఠాల గుర్తింపు వేగవంతం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఇళ్లనిర్మాణాలు, కళ్లాలతో పాటు గ్రామకంఠం భూముల గుర్తింపు కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు వేగవంతం చేయాలని ఈఓపీ ఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ సూచనల మేరకు మంగళవారం పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో గ్రామకంఠాల భూములను గుర్తించే విషయమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజల జిరాయితీ భూములతోపాటు ప్రభుత్వ భూములున్నాయని గుర్తించినట్లు చెప్పారు. ఆయా భూముల వివరాలను ఆన్‌లైనన్ విధానంలో పొందుపర్చి ఖాళీ స్థలాల్లో అర్హులైన పేదలందరికీ గృహసౌకర్యం కల్పించనున్నట్లు తెలియజేశారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈఓ వెంకటరమణ

పాలకొండ రూరల్: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.డి.వెంకటరమణ అన్నారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి ఎంఈఓలు, హెచ్‌ఎంలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సిలబస్ పూర్తి, రికార్డుల నిర్వహణ, పాఠంశ్యాల ప్రణాళికలు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్ నిర్వహణ, పాఠశాలల పర్యవేక్షణపై మండలాల వారీగా సమీక్షించారు. ప్రభుత్వం విద్యారంగానికి సమకూరుస్తున్న వనరులు సద్వినియోగపర్చుకుని ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరావు, ఏపీఓ వైఏ హరిప్రసాద్, డిప్యూటీ డీఈఓ విజయకుమారి, ఎంఈఓ ఎం .సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో నూతనంగా నిర్మించిన పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం అర్చకులు వెంకటరమణశాస్త్రి ఆధ్వర్యంలో మరకత లింగానికి, నందీశ్వరునికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం విగ్రహాల ప్రతిష్ఠ, అఖండ అన్నసమారాధన ఉంటుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అపరాలు కూడిక పనుల్లో రైతులు నిమగ్నం



అంటిపేటలో పండిన పెసరచేను తీస్తున్న మహిళాకూలీలు

సీతానగరం: మండలంలో ఖరీఫ్‌సీజన్‌లో మాగాణీ భూముల్లో సాగుచేసిన అపరాల పంటను కూడిక (ఇళ్లకు చేర్చే పనులు) చేసుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. 2022 నవంబరులో ఖరీఫ్ సీజన్‌లో పండిన వరిచేను కోతదశకు చేరిన వారం రోజుల ముందు అదును చూసి మినుము, పెసర పంటలను సాగుచేశారు. వాతావరణం అనుకూలించడంతో అపరాలపంట రైతుకు కలిసి వచ్చి ఏపుగా పెరిగింది. ఇప్పుడా పంటను ఇళ్లకు చేర్చి నూర్పిడి చేసే పనుల్లో ఉన్నారు. ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ 900 ఎకరాల్లో మినుము, 350 ఎకరాల్లో పెసర, 15 ఎకరాల విస్తీర్ణంలో ఉలవ పంటలను రైతులు సాగు చేశారని తెలిపారు. సీటివనరులున్న లచ్చయ్యపేట, అంటిపేట, వెంకటాపురం, బూర్జ, లక్ష్మీపురం, తామరఖండి, గెడ్డలుప్పి సుమిత్రాపురంలలో అపరాలపంట దిగుబడి రావడంతో రైతు కుటుంబాలు సాగు మడులలో చేను పనులు చేస్తున్నారని తెలియజేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అండగా ప్రభుత్వం



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ నాడు–నేడు పథకం ద్వారా రాష్ట్రంలో వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులన్నింటినీ బలోపేతం చేయడమే కాకుండా ప్రతి జిల్లా కేంద్రానికి ఒక మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రిని మంజూరు చేయడంతో పాటు ప్రతి జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

వైద్యానికి అధిక ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులందరికీ నెలనెలా రూ.పదివేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో తలసీమియా, సికిల్‌సెల్, ఎనీమియా, సివియర్ ఏమోఫిలియా, క్రానిక్ కిడ్నీ వ్యాధులు, కిడ్నీ, లివర్, గుండె మార్పిడి వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన రోగులు ఇదివరకు ఆయా వ్యాధులను నిర్ధారణ చేసుకుని సదరం ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే విశాఖపట్నం కేజీహెచ్‌లో రెండు మూడురోజుల పాటు ఉండి వైద్యం చేయించుకుని, నిర్ధారణయ్యాక గాని వచ్చేవి కావన్నారు. అలాంటి ముఖ్యమైన ఆ సేవలను మన ప్రాంత ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో గల జిల్లా ఆస్పత్రిలోనే ఇక నుంచి ఆయా సేవలు లభిస్తాయని వివరించారు. బాధితులందరికీ వచ్చే నెల నుంచి ప్రభుత్వం నుంచి పింఛన్ రూపంలో రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని, వారంతా న్యూట్రిషన్ ఫుడ్ తీసుకుని ఆరోగ్య స్థితిగతులు మరింత మెరుగుపరుచుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి వైద్యాధికారిణి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ శేషగిరిరావు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బాధిత రోగులు తదితరులు పాల్గొన్నారు.

సహారా ఇండియా బాధితులను ఆదుకోవాలి

పార్వతీపురం: సహారా ఇండియా బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతూ ఆ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేశారు. అనంతరం కార్యాలయంలో సహారా ఇండియా డెవలప్‌మెంట్ మేనేజర్ సీహెచ్ సుగుణాకర్ లేకపోవడంతో వెంటనే ఆయనతో ఫోన్‌లో మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీలోగా రీజనల్ మేనేజర్ బి.లక్ష్మణరావును కొమరాడ తీసుకువచ్చి బాధితులకు భరోసా కల్పించాలని చెప్పడంతో, అలాగే తీసుకు వస్తానని మేనేజర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.సాంబమూర్తి, నారాయణ రావు, వెంకటి నాయుడు, రాము, లక్ష్మి, సావిత్రమ్మ, గౌరమ్మ, పార్వతి, చంద్రమ్మ, గంగమ్మ, చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

సాలూరు: మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మున్సిపాలిటీలో 2023 – 24 సంవత్సరానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం రూ.11,47,46,500లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు దానికి సంబంధించిన బడ్జెట్‌పై సభ్యులు చర్చించారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్ల తదితర పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ ఈశ్వరమ్మ, సభ్యులు

చెత్త బుట్టల పంపిణీ



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ

పాచిపెంట: మండలంలోని గురువునాయుడుపేట పంచాయతీలో స్థానిక సర్పంచ్ గొట్టాపు చిట్టెమ్మ ఆధ్వర్యంలో మంగళవారం చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామ పంచాయతీ లక్ష్యంగా ప్రతి ఇంటికి రెండు చెత్త బట్టలు పంపిణీ చేస్తున్నామన్నారు. వీటిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంట్లో ఉండే తడి పొడి చెత్తను రోజు తెల్లవారుజామున వీధుల్లోకి చెత్త తీసుకు వెళ్లడానికి వచ్చే వాహనాల్లో చెత్త వేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొరజన్ని సింహాచలం, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరనాయుడు, యువజన విభాగం నాయకులు మీసాల చంటి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను ప్రజలు వినియోగించుకోవాలి



అందుతున్న సేవల గురించి గ్రామస్తులనుఅడిగి తెలుసుకుంటున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామస్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలందరూ పూర్తిగా వినియోగించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన అడ్డూరివలస గ్రామాన్ని సందర్శించి వైద్యాధికారి డాక్టర్ అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఓపీ నిర్వహణ రికార్డులను, రక్త పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న దీర్ఘకాలిక రోగుల ఆరోగ్య పరీక్షలు, గర్భిణులు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షేత్రస్థాయిలో నిర్వహించే గృహ సందర్శనలు, ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందిన వారి పర్యవేక్షణ, అంగన్వాడీ , స్కూల్ సందర్శన తదితర ఆరోగ్య తనిఖీల వివరాలు ఎప్పటికప్పుడు రికార్డుల్లోను, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. తదుపరి స్థానికులకు పలు ఆరోగ్య అంశాలపై డాక్టర్ జగన్‌మోహన్ అవగాహన కల్పించి, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాలోన్నారు.

భూ వివాదాలు లేని గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: భూ వివాదాలు, భూ తగాదాలు లేని గ్రామాలు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు భూ పథకం 'మీ భూమి–మా హామీ' 100 ఏళ్ల తరువాత రాష్ట్రంలో చేపట్టిన బృహత్తర కార్యక్రమమన్నారు. 100 ఏళ్ల తర్వాత సర్వే జరుగుతోందని, ఈ సర్వేను మన గ్రామంలో పూర్తిచేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు గొప్ప మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివన్నారాయణ, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథ రావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, గ్రామ సర్పంచ్ గండి శంకరరావు, ఎంపీటీసీ సభ్యులు బ రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు వంగపండు త్రినాథ నాయుడు, బడే శ్రీరంజన్, జక్కు ప్రవీణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, మజ్జి శేఖర్, మిరియాల కామేష్, మన్మథరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



భూ హక్కు పత్రాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అంతరాష్ట్ర రహదారి విస్తరణ పనుల పరిశీలన

పార్వతీపురం–ఒడిశా రాష్ట్రాల మధ్య జరుగుతున్న అంతరాష్ట్ర రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో పనులను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే అలంజగి జోగారావు మంగళవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఎటువంటి భేషజాలకు పోకుండా గ్రామమంతా ఏకమై రాజకీయాలకు అతీతంగా సహకరించినట్లు గ్రామ నాయకులు ఎమ్మెల్యేకు తెలియచేశారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందని గ్రామం ప్రధాన రహదారి విస్తరణతో పాటు ఇరు వైపులా సీసీ కాలువల నిర్మాణం కూడా చేపట్టి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామనాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ

క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా చిన్నబొండపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీరలు, కొంతమొత్తం ఆర్థిక సాయం ఎమ్మెల్యే జోగారావు అందజేశారు.